# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-05-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు.**

2. **ఆంధ్రప్రదేశ్‌లో పల్నాడు జిల్లా కలెక్టర్‌తో పాటు మూడు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.**

3. **తెలంగాణలో జూన్ 4వ తేదీలోగా పెండింగ్‌లో ఉన్న ధరణి వెబ్ పోర్టల్ భూ సమస్యల ఫిర్యాదులను పరిష్కరిస్తామని ధరణి కమిటీ తెలిపింది.**

4. **ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు, అనంతపురం జిల్లాల్లో సిట్ ప్రత్యేక విచారణ బృందాలు విచారణ జరిపాయి.**

5. **భారత రాష్ట్రపతిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా సేవలు అందించిన డాక్టర్ నీలం సంజీవరెడ్డి జయంతి ఈరోజు.**

==========================

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూంలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సమూన్, జిల్లా ఎస్పీ జి.ఆర్. రాధికలతో కలిసి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ముకేష్ కుమార్ మీనా మాట్లాడుతూ, శ్రీకాకుళం పార్లమెంటుతో పాటు, ఎనిమిది శాసన నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించామన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద అన్నిరకాల భద్రతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పల్నాడు జిల్లా కలెక్టర్‌గా శ్రీకేశ్ లట్కర్ బాలాజీతో పాటు మూడు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. పల్నాడు ఎస్పీగా మల్లికా గార్గ్, తిరుపతి ఎస్పీగా హర్షవర్ధన్, అనంతపురం ఎస్పీగా గౌతమి సాలిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల

సందర్భంగా జరిగిన ఘర్షణలపై చర్యలు తీసుకున్న ఎన్నికల సంఘం ఆయా జిల్లాల ఎస్పీలను సస్పెండ్ చేసింది. వారి స్థానంలో కొత్త ఎస్పీలను నియమిస్తూ ఎన్నికల సంఘం ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

తెలంగాణలో జూన్ 4వ తేదీలోగా పెండింగ్‌లో ఉన్న ధరణి వెబ్‌పోర్టల్ భూ సమస్యల ఫిర్యాదులను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ధరణి కమిటీ తెలిపింది. నిన్న హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో సమావేశమైన కమిటీ తెలంగాణలో నెలకొన్న భూ సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం ప్రభుత్వానికి పలు సూచనలు చేసింది. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలను నిర్వహించి ఇప్పటివరకు లక్షన్నర ఫిర్యాదులకు పరిష్కారం చూపిందని తెలిపింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ లావాదేవీలపైనా కమిటీ అధ్యయనం చేస్తోందని, భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు ధరణి కమిటీ పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు ముందు, తర్వాత జరిగిన ఘర్షణలపై విచారణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక విచారణ బృందం–సిట్ నిన్న పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట, అనంతపురం జిల్లా తాడిపత్రిలలో దర్యాప్తు చేపట్టింది. ఏసీబీ అదనపు ఎస్పీ సౌమ్యలత ఆధ్వర్యంలో నలుగురు సభ్యుల బృందం నరసరావు పేటకు వెళ్లి తొలుత ఘర్షణలు జరిగిన సంఘటన స్థలాలను పరిశీలించారు. అనంతరం పల్నాడు రోడ్డులోని టూటౌన్ పోలీసు స్టేషన్లో అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈరోజు నరసరావు పేట వన్‌టౌన్, రూరల్ పోలీసు స్టేషన్లలోనూ విచారించనున్నారని అధికారులు తెలిపారు.

అలాగే ఒంగోలు ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలోని సిట్ బృంద సభ్యులు అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో పోలింగ్ రోజు ఘర్షణలు జరిగిన ఓం శాంతినగర్, 1 జూనియర్ కాలేజీ మైదానం, చింతలరాయుని పాలెం తదితర ప్రాంతాలను పరిశీలించారు. రెండురోజుల పాటు సిట్ దర్యాప్తు కొనసాగుతుందని పోలీసు అధికారులు తెలిపారు.

---------------------------

భారత రాష్ట్రపతిగా, లోక్‌సభ సభాపతిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా వివిధ పదవులను అలంకరించి, ప్రజల మన్ననలను పొందిన నీలం సంజీవరెడ్డి జయంతి ఈరోజు. 1913 మే 19న ఆయన జన్మించారు. నిస్వార్థ సేవకుడిగా ప్రజలకు సేవలందించిన ఆయన ఎలాంటి హంగు ఆర్భాటాలకి తావివ్వకుండా నిస్వార్థ సేవలను అందించారు. 1958లో శ్రీవెంకటేశ్వర విశ్వ విద్యాలయం సంజీవ రెడ్డికి గౌరవ డాక్టరేట్ అందచేసింది.

---------------------------

తెలంగాణలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తడి, పొడి చెత్తను వేరుచేసే ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని, నిరంతరాయంగా కంపోస్టు తయారీని కొనసాగించాలని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. నిన్న హైదరాబాద్‌లో ఆయన జిల్లా పంచాయతీ అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో అంత్యక్రియలు నిర్వహించే వైకుంఠ ధామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని

సూచించారు. పంచాయతీ నర్సరీ, డంపింగ్‌యార్డు, ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం, వైకుంఠధామాలను సక్రమంగా నిర్వహించాలని, రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు జిల్లాల్లో పర్యటించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

---------------------------

హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పులు చేశారంటూ జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని హైదరాబాద్ మెట్రో రైలు అధికారులు వెల్లడించారు. మెట్రో రాకపోకల్లో ఎటువంటి మార్పు చేయలేదని, యథావిధిగానే ఉదయం 6గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మెట్రో రైళ్లు నడుస్తాయని స్పష్టం చేశారు. ప్రతి శుక్రవారం రాత్రి 11 గంటల 45 నిమిషాల వరకు, ప్రతి సోమవారం ఉదయం 5 గంటల 30 నిమిషాల నుంచే రైళ్ల రాకపోకలపై పరిశీలన మాత్రమే జరిగిందని, ఇంకా ఆ వేళలపై ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఈనెల 22న నెల్లూరులో పర్యటించనున్నారని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎం. హరి నారాయణన్ తెలిపారు. వెంకటాచలం మండలం కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో గవర్నర్ పాల్గొంటారన్నారు. గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ నిన్న అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గవర్నర్ పర్యటన సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం విస్తృతంగా ఏర్పాట్లు చేస్తోందని చెప్పారు.

---------------------------

ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి ఎన్నికల సంఘం ప్రవేశ పెట్టిన సీ-విజిల్ యాప్‌కు రెండు నెలల్లో 4.24 లక్షల ఫిర్యాదులు వచ్చినట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఓ ప్రకటనలో వెల్లడించింది. వీటిలో అత్యధిక ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపింది. మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఇప్పటివరకు కోడ్ ఉల్లంఘనలపై 4 లక్షల 24 వేల 317 ఫిర్యాదులు రాగా... 4 లక్షల 23 వేల 908 ఫిర్యాదులను పరిష్కరించామని, మరో 409 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఎన్నికల సంఘం తెలిపింది.

---------------------------

ఈనెల 22న నైరుతీ బంగాళాఖాతంపై అల్పపీడనం ఏర్పడే సూచనలు ఉన్నట్లు భారత వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అల్పపీడనం బలపడి మే 24 నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా శ్రీలంక వరకూ ఉపరితల ద్రోణి, సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తున కొనసాగుతోందని పేర్కొంది. దీని ప్రభావంతో ఈనెల 23 వరకూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. కోస్తాంధ్ర, తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

ఇక తెలంగాణలో ఈరోజు ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 22వ తేదీ వరకు 'పసుపు 'రంగు హెచ్చరికలు జారీ చేసింది. కాగా నిన్న హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసింది. హయత్‌నగర్‌లో 5.6, ఉప్పల్ 4.7, రామంతాపూర్‌లో 4.7 సెంటి మీటర్ల వర్షపాతం నమోదైయిందని వాతావరణం

అధికారులు తెలిపారు. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలోకి వచ్చే అనేక ప్రాంతాల్లో గంటపాటు భారీగా వాన కురవడంతో హైదరాబాద్‌లోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గతేడాది డిసెంబరులో సంభవించిన మిగ్ జాం తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతులకు 442.35 కోట్ల రూపాయల పంట రాయితీ నగదుని రాష్ట్ర ప్రభుత్వం నిన్న విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పంట రాయితీలో భాగంగా వ్యవసాయ పంటల నష్టానికి 391.31 కోట్ల రూపాయలు , ఉద్యాన పంటల నష్టానికి 51.04 కోట్ల రూపాయలను రైతులకు చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. రెండు రోజుల్లో రైతుల ఖాతాలకు నగదు జమ చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

======================